
అవి నేను రెండో తరగతి చదువుతున్న రోజులు. మా బడి పేరు ఎమ్మెమ్‌ఎల్‌డ బ్ల్యుఓ ఎలిమెంట్రీ స్కూల్. మా బడి పేరు చెప్తుంటేనే నాకు ఒకింత గర్వంగా వుంటుంది. ఎందుకంటే ఇంగ్లీషంతా మా బడి పేర్లోనే వుంటుందని నా కన్పిస్తది. రెండో తరగతి పూర్తయ్యింది. ఎండాకాలం సెలవులొచ్చేసినయ్.

# గులుకయ్యోరమ్మ

**ఇసుకమట్ల కరుణ్**

**అప్పుడు నా పెండు బోసోడు ఓ మాట చెప్పిండు. 'ఒరేయ్. ఈసారి ఏమైనా మనం మూడో తరగతికి ఇస్కూలు బ్యాగు కొనుక్కోనెళ్ళాల్రా' అని.**

ఒక్కసారి మున్సబు కొడుకు రాజుగాడి బ్యాగు నా కళ్ళముందు కదిలింది. నాక్క్యాడా అట్టాంటి బ్యాగే కావాలని ఎప్పట్నించో ఉంది. ఏడో తరగతి చదివే మాయన్నకే బ్యాగు లేదు, ఇహ నాకేం కొనిస్తాడు మా నాయన. ఈసారి ఏమైనా సరే మూడో తరగతికి కొత్త బ్యాగుతో రాజుగాడికి పోటీగా పోవాలనుకొన్నా. అనుకొన్నదే తడవు ఇంటికొచ్చి మా యమ్మతో చెప్పినా. 'యమ్మా, యమ్మా, నేను రెండో తరగతి ప్యాసై మూడో తరగతికెళ్తుండా కదా. ఈసారి నాకు ఇస్కూలు బ్యాగు కావాలేయని' అప్పుడు మాయమ్మ చెప్పింది – 'ఇట్టాంటి ఎదవాలోచన్లు పెట్టుకోమాక. మీ నాయన కొనియ్యడు' అని. నేనూర్కుంటానా, మాయమ్మ ఎంటబడి యాడవడం మొదలె





## ఫ్లోరిడా బీచ్ కళకళ

ఫ్లోరిడాకు అతి సమీపంలో వున్న బీచ్ ఇది. వారానికి రెండు రోజులు సెలవుదినాలు వున్న అమెరికన్లకు సేదదీర్చటంలో ఈ బీచ్ ఎంతగానో ఉపయోగపడుతోంది. ఆడా మగా తేడాలేకుండా బికినీలతో ఓలలాడిపోయే ఈ బీచ్... శని ఆదివారాలలో కళకళలాడుతుంటోంది.

ట్టినా. నా నస పళ్ళాకో ఏమో 'ఒరేయ్ మీ నాయనొచ్చినాక అడగతా లేరా' అనింది.

ఆ సాయంతరంగా మా నాయనొచ్చినాడు. సానం చేసి, అన్నం తిని బయట నవ్వారు మంచమేస్కొని పండుకొన్నాడు. ఆ పక్కనే నులక మంచంమీద ఉన్న మా యమ్మ దగ్గరకెళ్ళి 'యమ్మా, యమ్మో అడగవే' అన్నా. అహ, అప్పుడు మా యమ్మ ఎంత అందంగా అడిగిందంటే ఎట్టాటోడికైనా సరే కాదని చెప్పాలనిపించేంత అందంగా. 'ఏమయ్యో, ఈడికి ఇస్కూలు బ్యాగు గావాలంట' అని చెప్పింది. అప్పుడు మా నాయన అన్నాడు – 'బ్యాగా, ఈ నా కొడుక్కి పలకే ఎక్కువ. ఇహనుంచి రోజూ పొద్దుగాలే పేడెత్తి. సాయంతరం సుదుగులు ఏర్కొని రమ్మన్జెప్పు' అని. నా యాశలు అడియాశలైనియ్. బ్యాగు లేదు కదా రెండు పన్లు మీద పడినాయి. 'ఒరేయ్, బోసోడా, నిన్ను తన్నాల్రా' అనుకొన్నా. ఆ మరుసటి రోజు ఉదయాన్నే బోసోడింటికి పోయినా. రాతిరి జరిగింది చెప్పినా. అప్పుడు వాడు ఒక మగత్తరమైన అయిడియా జెప్పిండు. అదేంటంటే ''ఒరేయ్ యాపకాయలు ఏరదాము, బస్తాకి అర్ధ రూపాయి లెక్కన రైతులు కొంటారు. ఈ సెలవల్లో పది బస్తాలు ఏరామనుకో, మనకు బ్యాగొచ్చేసిద్దిరా'' అని. ఇంకంతే ఎనక్కి తిరిగి చూడలేదు. యాడాడ యాపచెట్లున్నాయో చూసేదానికి ముందుగా ఒక రౌండేసొచ్చినం. మా యింటి ముందే రెండు పెద్ద యాపచెట్లున్నాయి. అక్కడి నుంచే మొదలెట్టాలనుకొన్నాం.

ఆ మరుసటిరోజు నుంచే ఆరంభించినాము. పొద్దున్నే సంచి తీసుకెళ్ళడం, యాపకాయలు ఏరి మధ్యానానికి ఇంటికి రావడం, అన్నం తిని మళ్ళీ పొద్దుపోయేదాక యాపకాయలు యారడం. సరిగ్గా అప్పుడే నా కట్టాలు ఆరంభమైనాయ్. ఏం తింటుండానో అర్ధంగాలేదు గాని నా బుగ్గలు ఇంతింత లావున ఉబ్బినయ్. అప్పుడు తెలిసింది నాకు అమ్మోరొచ్చిందంట. అమ్మోరొస్తే ఇంట్లోంచి బయటికెళ్ళకూడదంట. యాపాకు ఉండలు మింగాలంట. పత్తెం సెయ్యాలంట. అమ్మోరొచ్చినోళ్ళకి నగలు అలంకరించాలంట, మాయమ్మ ఆమె నగలు (అయి అక్కడక్కడా తెలతెల్లగా, పసుప్పసుపుగా ఉంటాయిలెండి) తీస్కొని నా మెళ్ళో ఏసింది. ఒకదానికి గుండ్రటి పతకం ఉంది. అది నా బొడ్డు దగ్గరకు వచ్చింది. ఇంకోటి దానిక్కొంచెం పైదాక, ఇంకోటి ఎద వరకు వచ్చినాయి. ఆ తల్లి అంతటితో ఆగకుండా గాజులు కూడా తెచ్చి నా చేతులకేసింది. ఉక్కపోతకి చొక్కా తీసి పడేసి బైటకొచ్చి నిలుచున్నా. ఎదురుగండా బోసోడు యాపకాయలు ఏరుకుంటూ కనబడినాడు. ఒక్కసారిగా నాకు బ్యాగు గుర్తుకొచ్చింది. అటూ, ఇటూ జూసిన, మాయమ్మ లేదని ఖాయం జేస్కొని, సంచి దీస్కొని యాపకాయలు ఏరడానికి పరిగెత్తినాను. ఆ నగలు, గాజులు ఏస్కొని యాపకాయలు ఏరుతుంటే నా సామిరంగా నా యందమునిందీ, సాచ్చాత్తు ఇభీషణ చక్కరవత్తే వచ్చి యాపకాయలు ఏర్తున్నట్టునింది. యాణ్ణుంచి చూసిందో గాని మాయమ్మ నా యనకాతలె వచ్చింది. ఆ బొడ్డు పెంచలమ్మ దయాదాచ్చిన్నం లేకుండా ఈపుమీద నాలుగు బాదేటప్పటికి, ఆ సంచా డపడేసి ఇభీషణ చక్కరవత్తి ఇంట్లోకి లగెత్తినాడు. ఆ రాతిరి మాయమ్మ జరిగింది చెప్పినట్టుంది. పొద్దుగాలె మా నాయన నా దగ్గరకొచ్చి 'ఒరేయ్, చిన్నోడా నువ్ బయటికెళ్ళి యాపకాయలు యారమాక, నేన్నీకు ఇస్కూలు బ్యాగు కొనిపెడ్తాలె' అన్నాడు. అప్పుడు నా మొగం జూడాల అచ్చంగా ఇభీషణ చక్కరవత్తే.

ఎండాకాలం సెలవులు అయిపోయినియ్. మూడో తరగతికి నేను కొత్తబ్యాగులో పలకేసుకొని బయలుదేరినా. ఆ యేడే మా తరగతికి ఒక కొత్త అయ్యోరమ్మ వచ్చింది. ఈ అయ్యోరమ్మ రావడంతోటె మా బడి అట్మాస్ఫియరే మారిపోయింది. ఈ అయ్యోరమ్మ యమా స్టయిలుగా ఉండేది. ఈ అయ్యోరమ్మ వస్తుంట పిల్లకాయలేంది, పెద్దోళ్ళు కూడా నోళ్ళెళ్ళబెట్టి చూసేటోళ్ళు. ఆమె నడుస్తుంటే, ఎనకాల్నించి చూస్తే నాకైతే ఎనిమిది అంకె గుర్తొచ్చేది. అట్టా నడిచేది ఆమె. ఆమెనందరు కులుకయ్యోరమ్మ అనేటోళ్ళు. బళ్ళో పిల్లకాయలము కూడా ఆమెను గురించి చెప్పుకొనేటప్పుడు కులుకయ్యోరమ్మ అనే చెప్పుకొనేవాళ్ళం. ఆమె అసలు పేరు అదే అనుకొన్నాం. సరిగ్గా అప్పుడే నాకు బ్యాడ్ టయిమ్ ఆరంభమైంది. ఒకరోజు పెద్దయ్యోరు డబ్బారేకుల సుబ్బారావు (అసలు పేరు డి. సుబ్బారావులెండి) మా తరగతికొచ్చి, ''ఒరేయ్, పిల్లకాయల్లారా, రేపు మన బడికి డీఈవో ఒస్తున్నాడు, అందుకని మీరందరు మంచి గుడ్డలేస్కొని శుభ్భరముగా తయార్రై రండి, ఆయనేమన్నా ప్రశ్నలేస్తే సమాధానాలు చెప్పేటట్టు బాగా చదువుకొని రండి'' అని చెప్పినాడు. నేను ఆ రేతిరంతా కట్టపడి గాంధీ పాఠం బాగా సదివి, పొద్దుగాల నిద్దరలేచి తలకి ఆముదం బెట్టుకొని దువ్వి, ఇస్తిరీ గుడ్డలేస్కొని అమాస్య చందురుడులో కమలాసన్ లాగ బడికెళ్ళినా. కాస్సేపటికి డీఈవోని ఎంటబెట్టుకొని మా పెద్దయ్యోరు వస్తుంటే, ఆ వచ్చేది డీఈవో కాదు మా పాలిట యమధర్మరాజు అని అప్పుడు నాకు తెలీలేదు. డీఈవో వస్తానే మా అయ్యోరమ్మ లేచి నమస్కారం చెప్పింది. మేమందరము లేచి అంతకుముందే ఆమె చేత కంఠతా బెట్టించిన గుడ్డమారిణింగ్ అని జెప్పినాము. మమ్మల్లందరినీ చూసి ఆయన కూర్చోమనినాడు. నేనేమో అందరికన్నా ముందు నా బ్యాగు ఆయనకు కనబడేటట్టు కూర్చున్నాను. అప్పుడు ఆయన ఒకణ్ణి లేపి 'జాతిపిత అంటే ఎవరు' అని అడిగినాడు. వాడు టక్కున గాంధి అని చెప్పినాడు. ఆ ప్రశ్న నన్నడిగుంటే బాగున్నే అని అనుకొన్నాను. మా అయ్యోరమ్మ, పెద్దయ్యోరు ముందు నేనేదన్నా సమాధానం చెప్పి మార్కులు కొట్టెయ్యాలని నా తాపత్తరయం. కాని ఆ డీఈవో నన్ను ఒక్క ప్రశ్న కూడా అడుగలేదు. చివరిలో 'వెరీగుడ్' అని వెళ్ళబోతూ ఆగి, నా కొంప ముంచేదానికోసరమేనన్నట్టు నన్ను లేపి ''మీ టీచరు పేరేంటి?'' అని అడిగినాడు. నేను చేతులు కట్టుకొని ''మా అయ్యోరమ్మ పేరా సార్?'' అని అడిగినాను. ''ఆ, అవును'' అన్నాడు. ''మా అయ్యోరమ్మ పేరు, కులుకయ్యోరమ్మ స్సార్'' అని అన్నాను. ఆయన అర్ధంకాక ''ఏం పేరు'' అని మళ్ళీ అడిగిండు. ''కులుకయ్యోరమ్మస్సార్'' అని ఈసారి ఇంకా పెద్దగా బడి బడంతా ఇనబడేటట్టు చెప్పినాను. ఆయన నవ్వుకుంటూ ఎళ్ళిపోయినాడు. ఆయనతో కూడ పెద్దయ్యోరు ఎళ్ళిపోయినాడు. (నాకేం తెలుసు ఆయమ్మ అసలు పేరు నవామణి అని). ఆ తరువాత అయిదు నిమిషాలకు మా కులుకయ్యోరమ్మ నాకు మర్యాద చేసిందీ నా సామిరంగా ఈపు ఇమానం మోత అంటే ఏమిటో అప్పుడర్ధమయ్యింది.